క్లుప్తంగా

అంగన్వాడీ హెల్పర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

సాలూరు: మున్సిపాలిటీలో మూడు అంగన్వాడీ హెల్పర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీడీపీఓ విజయలక్ష్మి ఓ ప్రకటనలో తెలిపారు. రోస్టర్ ప్రకారం, కాపుబొడ్డవలస ఎస్సీ, గొట్టాపువీధి ఓసీ, వెంకటేశ్వరకాలనీ-1బీసీ బీకి కేటాయించామని పేర్కొన్నారు. పైపోస్టులకు అర్హులైన అభ్యర్థినులు ప్రాజెక్టు కార్యాలయంలో ఈ నెల 31 సాయంత్రం 5 గంటలలోగా దరఖాస్తులు అందించాలని తెలిపారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై రమేష్ నాయుడు

గరుగుబిల్లి: మండలంలోని తోటపల్లి కుడి కాలువ పరిధి మరుపెంట పరిసరాల్లో సుమారు 40 నుంచి 45ఏళ్ల గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు స్థానిక ఎస్సై టి.రమేష్ నాయుడు పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం స్థానికుల సమాచారంతో కుడికాలువ పరిధిలోని మరుపెంట పరిసరాల్లో మృతదేహాన్ని పరిశీలించినట్లు చెప్పారు. మృతదేహం పూర్తిగా ఆనవాళ్లు లేకుండా ఉండడంతో గుర్తించలేకపోయామన్నారు. గుర్తుతెలియని అనుమానాస్పద వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు కేసు నమోదు చేసి శవ పంచనామా నిర్వహించి పోస్టుమార్టం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

శాశ్వత భూహక్కు కల్పించాలి


తాన్నవలసలో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు, గిరిజనులు

పార్వతీపురం రూరల్: గిరిజనులు సాగుచేస్తున్న భూములకు శాశ్వత భూహక్కు పత్రాలను మంజూరు చేయాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలంలోని గంగాపురం పంచాయతీ తాన్నవలస గ్రామంలో గత 40ఏళ్లుగా గిరిజనులు సాగు చేస్తున్న భూములకు పట్టాదారు పాస్‌పుస్తకాలు మంజూరు చేయాలని కోరారు. గిరిజనులు సాగుచేస్తున్న భూములకు సంబంధించి వ్యక్తిగతంగా పట్టాలు మంజూరు చేయాలని పలుమార్లు అధికారులకు విన్నవించినప్పటికీ పట్టాలు మంజూరు చేయలేదన్నారు. గ్రామంలో రెవెన్యూ సదస్సుల్లో సాగు భూములకు దర్యాప్తు నిర్వహించినప్పటికీ ఇంతవరకు మంజూరు చేయలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాన్నవల, తొక్కుడువలస గ్రామాల్లో క్షేత్రస్థాయి పరిశీలన చేసి గిరిజనులు సాగు చేస్తున్న భూములకు శాశ్వత భూహక్కు కల్పించేలా చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు పి.రాము, ఎం. రాము, కె. చిరంజీవి, పి.వరాలు తదితరులు కోరారు.

డోకిశీలలో తాగునీటి కష్టాలు

● అవస్థలు పడుతున్న గ్రామస్తులు


గిరిజన ఆశ్రమ పాఠశాలలో నీటిని పడుతున్న మహిళలు


ఆశ్రమ పాఠశాల మోటార్ నుంచి పైప్ ద్వారా నీటి సేకరణ

పార్వతీపురం రూరల్: వేసవి ప్రారంభంలోనే ప్రజలకు తాగునీటి కష్టాలు తప్పడం లేదు. క్రాస్ ప్రోగ్రాం నిర్వహించి ప్రజలకు వేసవిలో తాగునీటి కష్టాలు లేకుండా చేస్తామని అటు అధికారులు, ఇటు పాలకులు నిత్యం ప్రకటనలు చేస్తున్నప్పటికీ ఆచరణలో కానరావడం లేదు. పార్వతీపురం మండలంలోని డోకిశీల గ్రామంలో పది రోజుల నుంచి గ్రామంలోని రక్షిత నీటి మంచినీటి పథకం కుళాయిల నుంచి తాగునీరు సరఫరా కాకపోవడంతో ప్రజల అవస్థలు వర్ణనాతీతంగా ఉన్నాయి. రక్షిత మంచినీటి పథకం నుంచి ప్రజలకు తాగునీటిని సరఫరా చేసే పైపులైన్ మరమ్మతుల బారిన పడింది. దీంతో తాగునీరు అందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో స్థానికంగా ఉన్న గిరిజన ఆశ్రమ పాఠశాలలో మోటార్ నుంచి నీటిని గ్రామస్తులు సేకరించి నిత్యావసరాలకు ఉపయోగించుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రక్షిత మంచినీటిని సజావుగా సరఫరా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

విప్లవకారునికి నివాళులు

బలిజిపేట:

మండలంలోని పెదపెంకి నేతాజీ గ్రంథాలయం వద్ద భగత్‌సింగ్ వర్ధంతి కార్యక్రమాన్ని గ్రంథాలయ వ్యవస్థాపకుడు ఈర్ల సంజీవనాయుడు ఆధ్వర్యంలో ఆదిఆరం నిర్వహించారు. ఈ సందర్భంగా భగంత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించా రు. ఈ సందర్భంగా సంజీవనాయుడు మాట్లాడుతూ భగత్‌సింగ్ ధైర్య సాహసాలకు పెట్టింది పేరని కొనియాడారు. భగత్‌సింగ్ ఇచ్చిన ఇంక్విలాబ్ జిందాబాద్ నినాదం దేశం నలుమూలలా వ్యాపించి యువతను ఉత్తేజపరిచిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో పెద్దలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.


బలిజిపేట: భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న గ్రామస్తులు

భగత్ సింగ్ పోరాట స్ఫూర్తి యువతకు ఆదర్శం

పార్వతీపురం: భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్ దేవ్ ఆశయాలను కొనసాగిస్తామని, భగత్‌సింగ్ ఎంప్లాయిమెంట్ గ్యారంటీ యాక్ట్ వెంటనే అమలు చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట జీవన్న,రైతు సంఘం రాష్ట్ర నాయకుడు బుడితి అప్పలనాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా ఆదివారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ, భారతదేశంలోకి వ్యాపారం పేరుతో వచ్చిన బ్రిటిష్ వారు దేశ పౌరులను బానిసలుగా చేసుకుని దేశ సంపదను దోచుకుపోయారన్నారు. మహాత్మా గాంధీ సహాయ నిరాకరణ ఉద్యమం ఉవ్వెత్తున జరుగుతున్న సమయంలో ఆకర్షితుడై భగత్ సింగ్ 13 ఏళ్ల వయసులోనే స్వాతంత్ర్య ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారని గుర్తు చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గరుగుబిల్లి సూరయ్య, జిల్లానాయకులు బొత్స మోహన్ రావు, బుడితి భారతి, లెనిన్ బాబు తదితరులు పాల్గొన్నారు.


పార్వతీపురం: భగత్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న సీపీఐ నాయకులు


రంగాలగూడలో భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పిస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు


సాలూరు: భగత్‌సింగ్‌కు నివాళులు అర్పిస్తున్న నాయకులు

భగత్‌సింగ్‌కు ప్రజాసంఘాల నివాళి

సాలూరు: సమాజంలోని అట్టడుగు వర్గాల పక్షాన పోరాడుతున్న వారికి నిరంతరం స్ఫూర్తిగా భగత్ సింగ్ జీవితం నిలుస్తుందని ప్రజాసంఘాల నాయకులు పేర్కొన్నారు. ఈ మేరకు భగత్‌సింగ్ 94వ వర్ధంతి సందర్భంగా ఆదివారం పట్టణంలో డీవైఎఫ్ఐ మహిళాసంఘం, సీఐటీయూ సంఘాల ఆధ్వర్యంలో భగత్‌సింగ్ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా భగత్‌సింగ్ చిత్రపటానికి పూలవమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ, భరతమాత దాస్యపు శృంఖలాలను తెంచేందుకు భగత్‌సింగ్, సుఖదేవ్‌రాజ్ గురులు చేసిన ప్రాణత్యాగాలు వెలకట్టలేనివన్నారు. తుదిశ్వాస వరకు ఇంక్విలాబ్ జిందాబాద్ అంటూ నినదించిన వారి ధైర్యం నేటి యువతకు ఎంతో స్ఫూర్తినిస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు స్వప్న, సంధ్య, లక్ష్మి, ఎన్‌వైనాయుడు, రాము, హరిబాబు, శ్రీను పాల్గొన్నారు.

విప్లవ కిశోరాలకు ఘనంగా నివాళి

పార్వతీపురం రూరల్: దేశ స్వాతంత్ర సాధన కోసం ఉరికొయ్యనెక్కిన భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్‌ల 94వ వర్ధంతిని డీవైఎఫ్ఐ, యూటీఎఫ్ నాయకుల ఆధ్వర్యంలో ఆదివారం పార్వతీపురం మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహించి వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ నాయకుడు మురళీమోహన్, డీవైఎఫ్ఐ కార్యదర్శి పి.రాజశేఖర్ మాట్లాడుతూ భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్‌లు అతి చిన్న వయసులోనే భారతమాత దాస్య శృంఖలాలను పగలగొట్టడం కోసం ఉరికంబాన్ని ముద్దాడిన వీర కిశోరాలంటూ వారి కీర్తిని కొనియాడారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు

రక్తదానం చేసి ప్రాణదాతలు కండి

● మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర


రక్తదాన శిబిరాన్ని సందర్శించిన మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

సాలూరు: రక్తదానం చేయడం ద్వారా ప్రాణదాతలు కావొచ్చని మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర అన్నారు. ఈ మేరకు సాలూరులోని వెలమపేట సేవాసంఘం సహకారంతో నవోదయ సేవా సంఘం రక్తదాన శిబిరం ప్రారంభించి 8వ ఏడాది రక్తదాన శిబిరం నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మాజా డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర పాల్గొన్నారు. ఈ శిబిరానికి వచ్చి రక్తదానం చేసిన యువతకు సర్టిఫికెట్లు అందించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, యువత ఈ విధంగా మరెన్నో మంచి పనులు చేయాలని ప్రోత్సహించారు. యువత తలుచుకుంటే ఏదైనా సాధించగలరన్నారు ముందుగా ఈ శిబిరాన్ని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఆర్‌పీ భంజ్‌దేవ్ ప్రారంభించారు. ఈ శిబిరానికి పట్టణ సీఐ అప్పలనాయుడు విచ్చేసి యువతను అభినందించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు వంగపండు అప్పలనాయుడు, గిరిరఘు, మొకాశ లక్ష్మణరావు, మజ్జి అప్పారావు, కొల్లి వెంకటరమణ, నాయకులు, యువత పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి దృష్టికి కొటియా సమస్య

● రేగు మహేశ్వరరావు


మాట్లాడుతున్న రేగు మహేశ్వరరావు

సాలూరు: కొటియా పల్లెల్లో ఒడిశా దౌర్జన్యకాండను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ల దృష్టికి తీసుకువెళ్లామని జనసేన సాలూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్, రాష్ట్ర గిరిజన ఉద్యోగుల న్యాయ సలహాదారు, న్యాయవాది రేగు మహేశ్వరరావు తెలిపారు. ఆంధ్రా, ఒడిశా వివాదాస్పద కొటియా గ్రూప్ గ్రామాల్లో ఒడిశా ప్రభుత్వం అక్రమ కట్టడాలను ఆయన ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఈ ప్రాంతంపై ఆంధ్రా, ఒడిశా రాష్ట్రాల స్టేటస్‌కో అమలులో ఉందన్నారు. 2022లో నాటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నాటి ఒడిశా సీఎం నవీన్‌పట్నాయక్‌తో చర్చలు జరిపారని గుర్తు చేశారు. కాగా ఇటీవల ఒడిశా అధికారులు ఈ ప్రాంతంలో దౌర్జన్యంగా అక్రమ నిర్మాణాలు జరుపుతున్నారని, ఈ విషయాలను ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి, సమస్య పరిష్కరించాలని కోరామన్నారు. ఆయన వెంట పలువురు నాయకులు, గిరిజనులు ఉన్నారు.

ప్రారంభానికి సిద్ధంగా వాహన ఫిట్‌మెంట్ ఆఫీసు


ప్రారంభానికి సిద్ధంగా ఉన్న రేపిడ్ ఇన్సూరెన్స్ మార్కెటింగ్ ప్రైవేట్ లిమిటెడ్ కార్యాలయం

సీతానగరం: మండలంలోని రాష్ట్ర ప్రధాన రహదారిపై చినభోగిలి-కాశీపేట గ్రామాల మధ్య నిర్మాణం చేసిన వాహనాల ఫిట్మెంట్ సర్టిఫై జిల్లా కార్యాలయం ప్రారంభానికి సిద్ధంగా ఉంది. చినభోగిలి రెవెన్యూ పరిధిలో ఉన్న ప్రభుత్వ గుర్తింపు పొందిన రేపిడ్ ఇన్సూరెన్స్ మార్కెటింగ్ ప్రైవేట్ లిమిటెడ్ యాజమాన్యం ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు నిర్వహించి ఫిట్మెంట్ సర్టిఫై చేయాల్సి ఉంది, ఈ నేపథ్యంలో చినభోగిలి ఆటోమేటిక్ స్టేషన్ మీదుగా ఒడిశా, మధ్యప్రదేశ్, చెన్నై, కోల్‌కత్తా, బీహార్, ఛత్తీస్‌గఢ్, ఉత్తరాంచల్, ఉత్తరప్రదేశ్, ఛండీగఢ్ రాష్ట్రాలకు చెందిన వాహనాలు రోజువారీ వందలాది కొత్త, పాతవి తిరుగాడుతుంటాయి. ఈ మేరకు రాష్ట్ర రవాణా శాఖాధికారులు ఇక్కడినుంచే వాహనాలను తనిఖీలు చేసి ఫిట్మెంట్ సర్టిఫికెట్ ఇవ్వాల్సి ఉంటుంది, వాహనాలను తనిఖీ చేయాల్సిన యంత్రాలు, పనిముట్లు ఏర్పాటు చేశారు. అందుకు అవసరమైన మోటార్ వెహికల్స్ తనిఖీ అధికారులను నియమించారు.

ఎన్నికల హామీలు మంత్రి నిలబెట్టుకోవాలి


వెలగవలస వద్ద సువర్ణముఖి నదిపై మధ్యలో ఆగిపోయిన వంతెన పనులు

సాలూరు రూరల్: ఎన్నికల సమయంలో నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీలు ప్రస్తుత మంత్రి సంధ్యారాణి నిలబెట్టుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి మర్రిశ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం సీపీఎం మండల కార్యవర్గ సభ్యులు వెలగవలస వద్ద సువర్ణముఖి నదిపై మధ్యలో ఆగిపోయిన బ్రిడ్జి పనులు పరిశీలించారు. గతంలో ఈ నది దాటుతూ గిరిజనులు చనిపోయిన సందర్భంలో మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర బ్రిడ్జినిర్మాణానికి రూ.8 కోట్లు మంజూరు చేశారన్నారు. 2020 లో వంతెన పనులు ప్రారంభమై పనులు మధ్యలో నిలిచిపోవడంతో నిర్మాణ సామగ్రి, తుప్పుపట్టిపోతోందన్నారు. ఎన్నికల సమయంలో ప్రస్తుత గిరిజన శాఖామంత్రి సంధ్యారాణి అధికారంలోకి వచ్చిన వెంటనే బ్రిడ్జి నిర్మాణం పూర్తిచేస్తామని హామీ ఇచ్చారని అయితే అధికారంలోకి వచ్చి 10 నెలలు గడుస్తున్నా ఇంతవరకు బ్రిడ్జి పనులపై అధికారులతో కనీసం మాట్లాడకపోవడం విచారకర మన్నారు. అలాగే ఎన్నికల హామీల విషయంలో నియోజకవర్గంలో ఏఒక్క హామీని పరిశీలించిన ధాఖలాలు లేవన్నారు. మండలంలోని శివరాంపురం, సాంపిగాం, దండిగాం బ్రిడ్జిలకు నిధులు మంజూరై ఉన్నాయని, వెంటనే ఆ పనులు ప్రారంభించి పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. ఓట్లకోసం ఎన్నికల్లో హామీలు ఇచ్చిన నాయకులు ఇప్పుడు నిర్లక్ష్యంగా వ్యవహరించడం మంచిదికాదని హితవు పలికారు. కార్యక్రమంలో మండల కమిటీ నాయకులు సీదరపు అప్పారావు, వంతల సుందర్రావు, మెల్లిక అయోధ్య తదితరులు పాల్గొన్నారు.

లివిరిలో హరేనామ సంకీర్తన

భామిని: మండలంలోని లివిరిలో రాధాకృష్ణ మందిరంలో ఒడిశాకు చెందిన హరేరామ భక్తులు ఆదివారం నామసంకీర్తన చేశారు. డోలోత్సవంలో భాగంగా ప్రత్యేక పూజలు చేపట్టడంతో ఆలయం భక్తులతో నిండిపోయింది.

నేడు మండల పరిషత్‌లో ఉపాధి హామీ సోషల్ అడిట్

సీతానగరం: మండలంలోని గ్రామాల్లో ఇదివరలో జరిగిన ఉపాధి హామీ పనులకు అయిన ఖర్చులకు సంబంధించిన నిధుల వ్యయం, మెటీరియల్ కాంపొనెంట్‌తో చేసిన పనులపై మండల స్థాయిలో పనుల ఖర్చులపై సామాజిక తనిఖీలు జరుగుతాయని సోమవారం ఏపీఓ భాను తెలియ జేశారు. ఈ మేరకు ఆదివారం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో 2023- 24 ఆర్థిక సంవత్సరంలో కల్పించిన అభివృద్ధి పనులు, అమలు చేసిన సంక్షేమ పథకాలు ఏవిధంగా జరిగాయో క్షేత్రస్థాయిలో డీఆర్పీల పర్యవేక్షణలో సామాజిక తనిఖీలు జరిగాయని తెలిపారు. క్షేత్రస్థాయిలో తనిఖీలు పూర్తి కావడం వల్ల మండల స్థాయి తనిఖీలు సోమవారం సెర్ప్ సంస్థ ప్రతినిధులు, జిల్లా డ్వామా ఉన్నతాధికారుల పర్యవేక్షణలో సామాజిక తనిఖీలు చేయనున్నట్లు తెలియజేశారు. ఎంపీడీఓ పి త్రివిక్రమరావు ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమంలో ప్రజాప్రతినిదులు, ఉపాధి హామీ పనుల నిర్వాహకులు పాల్గొనాలని కోరారు.

మహిళల వికాసానికి 'ఉల్లాస్'


పార్వతీపురం రూరల్: ఉల్లాస్ పరీక్షను నిర్వహిస్తున్న అధికారులు


సూరంపేటలో ఉల్లాస్ పరీక్షలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ కార్యాలయం ఏఓ ప్రసాద్

పార్వతీపురం రూరల్: వివిధ పథకాల్లో అవగాహన లేమి, నిరక్ష్యరాస్యత కారణంగా లబ్ధిదారులు మోసాలకు గురవుతున్న నేపథ్యంలో మహిళల్లో ఆర్థిక, డిజిటల్ అక్షరాస్యతను పెంపొందించేందుకు కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా మండ లంలోని 53 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించినట్లు ఏపీఓ సన్నిబాబు పేర్కొన్నారు. మండలంలో నిర్వహించిన ఉల్లాస్ పరీక్షలను మండల స్థాయి అధికారుల ఆధ్వర్యంలో నర్సిపురం, హెచ్‌కారాడవలస, పెదబొండపల్లి, ఎమ్మార్ నగరం కేంద్రాలను ఆయన సందర్శించారు. పొదుపు సంఘాల మహిళలు, పాఠశాలల్లో పనిచేస్తున్న సహాయకులు, వంటవారు, కాపలాదారులు, ఆయాలు, అంగన్వాడీ కేంద్రాల్లో సహాయకుల్లో నిరక్ష్యరాస్యులను ఎంపిక చేసి వారికి బోధించేందుకు వయోజన విద్య ద్వారా పుస్తకాలను అందజేస్తామని తెలిపారు. కార్యక్రమం పరిశీలనలో వయోజన విద్య నోడల్ అధికారి రమాజ్యోతి, ఎ.డి వైకుంఠరావు, ఎంపీడీఓ జీవీ రమణమూర్తి, ఏపీఎం చిన్నతల్లి తదితరులున్నారు.

చదవడం నేర్చుకోవాలి

సీతానగరం: మండలంలో వెలుగు శాఖ ద్వారా సభ్యత్వం తీసుకున్న నిరక్షరాస్యులలైన మహిళలందరూ చదవడం, సంతకం చేయడంపై అవగాహన కల్పించుకోవాలని వెలుగు ఏపీఎం రెడ్డి శ్రీరాములు, సర్పంచ్ టి.ధనుంజయమ్మ అన్నారు. మండలంలో ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా ప్రతిఒక్క సభ్యురాలు చదండం నేర్చుకోవాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు విద్యాశాఖ పర్యవేక్షణలో నిర్వహిస్తున్న ఉల్లాస్ కార్యక్రమంలో అక్షర జ్ఞానంపై అందరూ అవగామన కల్పించుకోవాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధి యూనిట్లకు గడువు పెంపు

● బీసీ కార్పొరేషన్ ఈడీ ఆర్.గడ్డెమ్మ



పార్వతీపురంటౌన్:జిల్లాలో బీసీ వర్గాల స్వయం ఉపాధి పథకాలకు గడువు ఈ నెల 25తేదీవరకు పొడిగించినట్లు బీసీ కార్పొరేషన్ ఈడీ ఆర్.గడ్డెమ్మ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ అవకాశాన్ని బీసీ, ఈబీసీ అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బీసీ కార్పొరేషన్ ద్వారా రూ.23.24 కోట్లతో స్వయం ఉపాధి కార్యక్రమాలను అందించేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. జిల్లాలో శ్లాబ్-1కింద 868 యూనిట్లకు రూ. 13.02 కోట్లు, శ్లాబ్-2కింద 260 యూనిట్లకు రూ. 6.50 కోట్లు, శ్లాబ్-3 కింద 93 యూనిట్లకు రూ. 13.72 కోట్లు అందజేయనున్నట్లు తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి 21నుంచి 60 సంవత్సరాల మధ్య వయస్సు, దారిద్ర్యరేఖకు దిగువన గల వెనుకబడిన తరగతుల వారికి, అగ్రవర్ణ పేదలకు స్వయం ఉపాధి పథకం కింద యూనిట్లు అందించనున్నట్లు చెప్పారు.

27 జనరిక్ ఫార్మసీలకు అవకాశం

బీసీ అభ్యర్థులు 25 జనరిక్ ఫార్మసీ యూనిట్లను ఏర్పాట్లు చేసుకోవచ్చునని, ఇందుకు రూ.2కోట్ల వరకు ఆర్థికసాయం అందించనున్నట్లు తెలిపారు. యూనిట్ విలువ రూ. 8లక్షలు కాగా ఇందులో సబ్సిడీ రూ.4లక్షలు, బ్యాంకు రుణం రూ.4లక్షలు ఉంటుందని తెలిపారు. ఆర్థికంగా వెనుకబడిన వర్గాల వారు కూడా జనరిక్ ఫార్మసీ కేంద్రాలు ఏర్పాటు చేసుకోవచ్చునని ఇందులో భాగంగా ఈబీసీకి-1 యూనిట్, బ్రాహ్మణ వర్గానికి 1 యూనిట్ అందజేయనున్నామన్నారు.

25లోగా దరఖాస్తుల స్వీకరణ

అర్హులైన అభ్యర్థులు సచివాలయంలో కానీ ఇంటర్నెట్ సెంటర్‌లో కానీ, రేషన్, ఆధార్, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోతో ఈనెల 25లోగా హెచ్‌టీటీపీఎస్://ఏపీఓబీఎంఎంఎస్.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించాలన్నారు. దరఖాస్తు సమర్పించిన అనంతరం సంబంధిత ఎంపీడీఓ, మున్సిపల్ కార్యాలయాలను సంప్రదించాలని సూచించారు.

పేదలందరికీ ఇళ్ల స్థలాలు

సీతంపేట: నిరుపేదలందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కూరంగి మన్మధరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు, పట్టణంలో రెండు సెంట్ల స్థలాలు కేటాయించాలన్నారు. ఈ నెల 25న జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అర్హులైన వారందరూ దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఎయింఫర్ సేవా ఆశ్రమానికి అండగా ఉండాలి

● స్వామి స్వైరానంద సరస్వతి


ఎయింఫర్ సేవాకేంద్రంలోస్వామి దయానంద సరస్వతి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న స్వైరానంద సరస్వతి

సీతానగరం: మండలంలోని లచ్చయ్యపేటలో స్వామి దయానంద సరస్వతి సేవాశ్రమాన్ని ఇతోధికంగా ఆదుకోవాల్సిన అవసరం దాతలు, విద్యావంతులపై ఉందని స్వామి స్వైరానంద సరస్వతి అన్నారు. ఎయింఫర్ సేవా కేంద్రం ఆవరణలో ఆశ్రమ మేనేజరు నల్లా సురేష్ ఆధ్వర్యంలో మేనేజింగ్ ట్రస్టీలు నిర్మించిన స్వామి దయానంద సరస్వతి విగ్రహాన్ని ఆదివారం ఆయన, ఎంఈఓ జి.సూరిదేముడు, డాక్టర్ వాసుదేవరావు, బొబ్బిలి మున్సిపల్ మాజీచైర్‌పర్సన్ టి.అచ్యుతవల్లి ప్రారంభించారు. ఈ మేరకు స్వామి స్వైరా నంద సరస్వతి మాట్లాడుతూ స్వామి దయానందసరస్వతి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎయింఫర్ సేవా ఆశ్రమాల్లో లచ్చయ్యపేట ఒకటని అన్నారు. ఇక్కడి ఆశ్రమంలో విద్యనభ్యసించిన విద్యార్థులు ఉద్యోగాల్లో స్థిరపడ్డారని తెలుసుకుని ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా స్వామి దయానంద సరస్వతి విగ్రహాన్ని తయారు చేసిన శిల్పాచార్యుడు ఈదుబిల్లి జగన్నాథరావు దంపతులను స్వామిజీ సత్కరించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పి. శ్రీనివాసరావు, కొత్తా రవికుమార్, ఎస్.వెంకటప్పారావు తదితరులు పాల్గొన్నారు.

పేరుకే స్వచ్ఛ సంకల్పం





సాక్షి విజిట్

కలెక్టరేట్ సమీపంలో గల బూరాడవీధి, అగురవీధి, ఎస్సీ వీధి కాలువల్లో పేరుకుపోయిన మురుగు, ప్లాస్టిక్ వ్యర్థాలు

పార్వతీపురంటౌన్: జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమం కేవలం ఫొటోలు, ప్రకటనలకే పరిమితమైంది. పట్ట ణంలోని పలు వార్డుల్లో కాలువల్లో మురుగు, ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోవడంతో పట్టణ వాసులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ మేరకు ఆదివారం పట్టణంలోని పలు వార్డుల్లో పారిశుద్ధ్య కార్యక్రమలపై 'సాక్షి' క్షేత్రస్థా యి పర్యటన చేపట్టింది. ఈ సందర్భంగా పట్టణంలోని కాలువలు పరిశుభ్రంగా లేకపోవ డం, దోమలు వృద్ధి చెందడం వంటి సమస్యలను వెలుగుచూశాయి.

విత్తన గుళికలతో రైతుకు ప్రయోజనం

భామిని: విత్తన గుళికలతో రైతులకు ప్రయోజనం చేకూరుతుందని ప్రకృతి సాగు సిబ్బంది అన్నారు. నులకజోడు ఎంపీటీసీ సభ్యుడు బూస బాలకృష్ణ పర్యవేక్షణలో బిల్లుమడ, నులకజోడులో విత్తన గుళికల తయారీపై ఆదివారం అవగాహన కల్పించారు. ఏపీసీఎన్ఎఫ్ వలరౌతు ప్రభాకరరావు, కె.సంధ్య, పాల్గొన్నారు.